తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి
వికారాబాద్
శుక్రవారం
6 నవంబర్ 2026
పేజీలు : 08
Follow :



ముక్కిడి చెరువు ఎఫ్‌టీఎల్‌లో
అక్రమ నిర్మాణం
అధికారుల నోటీసులను లెక్కచేయని యజమాని

- కలెక్టర్, కమిషనర్‌కు స్థానికుల ఫిర్యాదు
- కూల్చివేతలు తప్పవన్న టౌన్ ప్లానింగ్ అధికారి



మల్కాజిగిరి నవంబర్ 5 (జనం సాక్షి) :

నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని రామకృష్ణాపురం ముక్కిడి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ నిర్మాణంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి మున్సిపల్ అనుమతులు లేకుండా చెరువు పరిధిని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దీనిపై స్థానికులు మేడ్చల్ జిల్లా కలెక్టర్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పందించిన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే పనులు నిలిపివేయాలని నిర్మాణదారునికి ఇప్పటికే రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ, అధికారుల ఆదేశాలను ఏమాత్రం లెక్కచేయకుండా యజమాని గుట్టుచప్పుడు కాకుండా నిర్మాణ పనులను కొనసాగిస్తుండటం విస్మయానికి గురిచేస్తోందనీ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారి బాల శ్రీనివాస్ వివరణ ఇస్తూ..

చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాన్ని నిలిపివేయాలని రెండుసార్లు నోటీసులు ఇచ్చిన మాట వాస్తవమేనని స్పష్టం చేశారు. నోటీసులను ఉల్లంఘించి, అనుమతులు లేకుండా నిర్మాణం కొనసాగిస్తే ఏమాత్రం ఉపేక్షించబోమని, త్వరలోనే అక్రమ నిర్మాణాన్ని నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామని హెచ్చరించారు. చెరువుల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

టీజీటీఈటీ మాక్ టెస్టును సద్వినియోగం చేసుకోండి

- మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి
- ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు సీబీటీ విధానంపై అవగాహన, ప్రాక్టీస్ కోసం అవకాశం



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 05 (జనంసాక్షి) :

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో టీజీటీఈటీ–2026 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల సౌకర్యార్థం కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంపై అవగాహన కల్పించేందుకు మాక్ టెస్టులు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి తెలిపారు. నవంబర్ 5 నుంచి 10వ తేదీ వరకు జిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో ఈ మాక్ టెస్టులు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

ఉపాధ్యాయులు ఉప్పల్, జవహర్‌నగర్, మల్కాజిగిరి బాలికల ఉన్నత పాఠశాల, కుత్బుల్లాపూర్, షాపూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తమకు అనుకూలమైన ఏదో ఒక కేంద్రాన్ని సందర్శించి మాక్ టెస్టు రాయవచ్చని సూచించారు. ఇందుకోసం https://schooledu. telangana.gov.in వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. సీబీటీ పరీక్షా విధానంపై పూర్తి అవగాహన పొందడంతోపాటు కంప్యూటర్ వినియోగంలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసుకోవడానికి, అసలు పరీక్షకు ముందస్తు ప్రాక్టీస్ పొందడానికి ఈ అవకాశం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన ఉపాధ్యాయులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రేణుకాదేవి కోరారు. మాక్ టెస్టుకు హాజరయ్యే ఉపాధ్యాయులకు ఎలాంటి ఆఫీషియల్ డ్యూటీ (ఓడీ) సౌకర్యం కల్పించబోమని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని గమనించి వ్యక్తిగత సౌలభ్యం మేరకు పరీక్షకు హాజరుకావాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న కంప్యూటర్, ఇంటర్నెట్ సదుపాయాలను ఉపాధ్యాయులు వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఎల్‌నినో ప్రభావాల నివారణ, జల సంరక్షణపై వర్క్‌షాప్



శేరిలింగంపల్లి, నవంబర్ 05 (జనంసాక్షి) : ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో భూగర్భ జలాల పరిరక్షణ, సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ శుద్ధిచేసిన నీటి పునర్వినియోగంపై గురువారం నిర్వహించిన ప్రత్యేక వర్క్ షాప్ కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్, నరెడ్ కో తెలంగాణ సంస్థలు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సివరేజ్ బోర్డ్ మరి సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొనడం జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో భూగర్భ జలాల సంరక్షణతోపాటు ఎత్తైన భవనాలు మరియు నిర్మాణ ప్రాజెక్టుల్లో తాగునీటికి అవసరంలేని ఇతర అవసరాలకోసం మురుగునీటి శుద్ధి కేంద్రాలద్వారా శుద్ధిచేసిన నీటిని వినియోగించడంపై ప్రధానంగా చర్చించారు. ఎల్‌నినో వాతావరణ పరిస్థితులవల్ల జల వనరులపై కలిగే ప్రభావాలను అర్థం చేసుకోవడం, భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు నివారణ చర్యలను గుర్తించడం, సమర్థవంతమైన నీటి నిర్వహణ మరియు సంరక్షణ పద్ధతులను అమలు చేయడంపై ఈ వర్క్ షాప్ లో సమగ్రమైన చర్చలు జరిగాయని అధికారులు వివరించారు. ప్రధానంగా ఎత్తైన నివాస, వాణిజ్య భవనాలు మరియు నిర్మాణ కార్యకలాపాల్లో తాగునీటికి అవసరంలేని భారీ స్థాయి అవసరాలకోసం శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించడాన్ని ప్రోత్సహించాలని వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. తద్వారా మంచినీరు మరియు భూగర్భ జలాలపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. సుస్థిరమైన నీటి వినియోగ పద్ధతులను ప్రోత్సహించడం, జల భద్రతను బలోపేతం చేయడం, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మున్సిపల్ అధికారులు, జల సరఫరా సంస్థలు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు మరియు ఇతర భాగస్వామ్య సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ వర్క్‌షాప్ స్పష్టం చేసింది. బాధ్యతాయుతమైన నీటి వినియోగం, భూగర్భ జలాల పరిరక్షణ మరియు శుద్ధి చేసిన మురుగునీటి గరిష్ట పునర్వినియోగం ద్వారా సుస్థిర పట్టణ అభివృద్ధి, దీర్ఘకాలిక జల భద్రత సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా సిఎంసి పునరుద్ఘాటించింది.





నీరు వృథా.. అధికారులకు పట్టదా ?

- వారం రోజులుగా పైపులైన్ లీకేజీ.. రోడ్డుపై పారుతున్న తాగునీరు

కీసర, నవంబర్ 05 (జనంసాక్షి) : ఓవైపు తాగునీటి ఎద్దడి భయాలు.. మరోవైపు అందుబాటులో ఉన్న నీరంతా వృథా! ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ.. నాగారం ఈస్ట్ గాంధీనగర్ లో వారం రోజులుగా పైపులైన్ లీకేజీతో విలువైన తాగునీరు రోడ్డు పాలవుతోంది. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాగారం డివిజన్ పరిధిలోని ఈస్ట్ గాంధీ నగర్ రోడ్డు నంబర్ 13 వద్ద తాగునీటి పైపులైన్ లీకేజీ ఏర్పడి వారం రోజులుగా నీరు వృథాగా ప్రవహిస్తోంది. ఒకవైపు ప్రజలు తాగునీటి అవసరాల కోసం ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు పైపులైన్ నుంచి నీరు రోడ్డుపై పారుతుండటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శిస్తున్నారు. నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రభుత్వం ప్రజలకు సూచిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో లీకేజీలను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టి, విలువైన తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జనంసాక్షి

విద్యార్థులు ఆత్మవిశ్వాసం, పట్టుదలతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి



కాప్రా,నవంబర్ 5 (జనం సాక్షి) : విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ ఆత్మవిశ్వాసం, పట్టుదలతో కృషి చేసి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలనగర్ కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని, చదువే బంగారు భవిష్యత్తుకు పునాది అని అన్నారు. చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, సమయపాలన అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ వారి మార్గదర్శకత్వంలో ముందుకు సాగాలని, ఎన్ని సవాళ్లు ఎదురైనా ఆత్మవిశ్వాసం, పట్టుదలతో కృషి చేసి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్,మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య, నాయకులు మల్లేష్ గౌడ్, గుమ్మడి జంపాల్ రెడ్డి, ప్రసాద్, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, చారి, దేవేందర్ కుమార్, దండెం నరేందర్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి







- **యువత మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి**
- **ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు కృషి చేయాలి**
- **ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం: ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**

తాండూరు, నవంబర్ 5 (జనంసాక్షి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, యువత మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు అధిక సమయం కేటాయించకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. గురువారం తాండూరు పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన టీసీఎల్-2026 టీఆర్ఎస్ఎంఏ క్రికెట్ లీగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించడం ద్వారా జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే మనోధైర్యం కలుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రికెట్ లీగ్‌ను అద్భుతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను అభినందించారు. అనంతరం తాండూరు మండలం చెన్గేష్‌పూర్ గ్రామంలోని శ్రీ హనుమాన్ దేవాలయ నూతన చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నూతన కమిటీ సభ్యులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకొని నూతన గృహాల్లో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామస్తులు, భక్తులు, ప్రజాప్రతిని ధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దీపావళి పటాకుల విక్రయాలకు తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి మున్సిపల్ కమిషనర్ బి. యాదగిరి



చేవెళ్ల, నవంబర్ 05 (జనంసాక్షి): రాబోయే దీపావళి పండుగ సందర్భంగా చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో బాణాసంచా విక్రయాల కోసం తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకునే వ్యాపారులు తప్పనిసరిగా మున్సిపాలిటీ నుంచి తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ పొందాలని మున్సిపల్ కమిషనర్ బి. యాదగిరి సూచించారు. అనుమతులు లేకుండా అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పటాకుల విక్రయదారులు, ప్రజలు తప్పనిసరిగా భద్రతా నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. దుకాణాల వద్ద ప్రమాదాల నివారణకు సరిపడా నీటి బకెట్లు, ఇసుక బకెట్లు, అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేయరాదన్నారు. అదేవిధంగా ప్రజలు పటాకులను బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే కాల్చాలని, ఇరుకైన సందులు, నివాస గృహాలు, ఇంధన నిల్వలు, విద్యుత్ పరికరాల సమీపంలో కాల్చకూడదని సూచించారు. పిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే బాణాసంచా కాల్చేలా చూడాలని, ప్రమాదాల నివారణకు కాల్చే ప్రదేశంలో నీటితో నింపిన బకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. పటాకులు కాల్చే సమయంలో నూలు దుస్తులు ధరించాలని, నైలాన్ లేదా వదులుగా ఉండే దుస్తులకు దూరంగా ఉండాలని సూచించారు. వ్యాపారులు, ప్రజలు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ యాదగిరి విజ్ఞప్తి చేశారు.

ప్రజాసేవే లక్ష్యంగా మోర్రీ బందయ్య సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువ

పూడూర్ సెప్టెంబర్ 05 జనసాక్షి: ప్రజలకు సేవ చేయడం, సమాజ అభివృద్ధికి తోడ్పడటం, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరిలో ఉండాల్సిన గొప్ప లక్షణాలు. ఈ నేపథ్యంలో వికారాబాద్ జిల్లా పూడూర్ మండలం మిట్టకంకల్ గ్రామానికి చెందిన మోర్రీ బందయ్య గురించి ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాల్సి ఉంది ప్రజాసేవ అనేది కేవలం మాటల్లో కాకుండా చేతల్లో కనిపించాలి పేదలు నిరుపేదలకు సహాయం అందించడం ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వడం గ్రామంలో సామాజిక ఐక్యతను పెంపొందించడం ప్రజల సంక్షేమానికి కృషి చేయడం వంటి కార్యక్రమాలు సమాజ అభివృద్ధికి దోహదపడతాయి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడం సామాజిక బాధ్యతను చాటుకోవడం ఎంతో ముఖ్యమైన అంశాలు సమాజంలో అవసరమైన వారికి సహాయం అందించాలనే ఆలోచన మరింత మందిలో కలిగినప్పుడే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయి మోర్రీ బందయ్య చేపట్టిన సేవా కార్యక్రమాల వివరాలను ప్రజలకు తెలియజేయడం ద్వారా ఆయన సేవా ప్రస్థానాన్ని మరింత విస్తృతంగా ప్రజల ముందుకు తీసుకురావచ్చు సేవాభావంతో చేసే ప్రతి మంచి పని సమాజానికి ఆదర్శంగా నిలుస్తుంది. ప్రజల సంక్షేమమే ధ్యేయంగాసమాజ అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలి అని ఆయన పేర్కొన్నారు

ప్రతి ఇంటికి ఇంకుడు గుంత - తాటిపర్తి సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్

యాచారం, నవంబర్ 5(జనం సాక్షి) యాచారం మండలం తాటిపర్తి గ్రామంలో భూగర్భ జలాల పెంపుదల మరియు పరిశుభ్రతను కాపాడే లక్ష్యంతో "ప్రతి ఇంటికి ఇంకుడు గుంత" కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. గ్రామంలోని ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతల నిర్మాణానికి ఎంపీవో శ్రీలత స్వయంగా విచ్చేసి మార్కింగ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షపు ప్రతీ చుక్కనూ వృథా చేయకుండా, ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడం ద్వారా భూగర్భ జలాలను పరిరక్షించుకోవచ్చని, తద్వారా తాటిపర్తి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్, పంచాయీ సెక్రటరీ శివకుమార్, ఉప సర్పంచ్ ముడిది రమేష్, వార్డు సభ్యులు దార దశరథ, ఆడాల సుశీల, ఏనుగొండ శ్రీశైలం, యాచారం మలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగం స్వదేశీ జాగరణ మంచ్ పాలమూరు విభాగ్ కో కన్వీనర్‌గా చింతల మొగులప్ప నియామకం

బొంరాస్ పేట, నవంబర్ 5 (జనం సాక్షి): ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగం స్వదేశీ జాగరణ మంచ్ పాలమూరు విభాగ్ కో కన్వీనర్ గా నియమితులైన చింతల మొగులప్పను గురువారం మండల కేంద్రంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షులు ఉప్పరి జగదీశ్వర్ సాగర్, నాయకులు ముకుందు, నర్సింలు, సతీష్ తదితరులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఉప్పరి జగదీశ్వర్ సాగర్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ విద్యార్థి విభాగమైన ఏబీవీపీలో కో కన్వీనర్ స్థాయి నుంచి వివిధ బాధ్యతల్లో క్రియాశీలకంగా పనిచేసే నేడు గొప్ప స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు.

ప్రభుత్వ పాఠశాల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ ఆరా.. అధికారులకు వినతి

- **ఉప్పల్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన నాయకులు**
- **అపరిశుభ్రతతో విద్యార్థుల అవస్థలు.. చెత్తను తక్షణమే తొలగించాలని డిమాండ్**



ఉప్పల్, నవంబర్ 5 (జనం సాక్షి): ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఉప్పల్ మండల సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, పాఠశాలలో అందుతున్న భోజనం నాణ్యతతో పాటు విద్యా సదుపాయాలు, మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నెలకొన్న అపరిశుభ్రతను నాయకులు గుర్తించారు. వారం రోజులుగా పాఠశాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలను తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుకునే పాఠశాల ఆవరణే అపరిశుభ్రంగా ఉంటే వారి ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే మున్సిపల్ సిబ్బంది స్పందించి పాఠశాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు ఉప్పల్ శానిటేషన్ అధికారి నీలిమ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

అనంతరం ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ. అజీమ్ పాషా, జీ. మహేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు పాఠశాలను సందర్శించామని తెలిపారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యా సదుపాయాలు, తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, ఉపాధ్యాయుల కొరత తదితర అంశాలపై వివరాలు సేకరించామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులని, అలాంటి విద్యా సంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన పరిసరాలు, సరిపడా తరగతి గదులు, సౌకర్యవంతమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉండాలని కోరారు.ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు. పాఠశాలల్లో సమస్యలు ఉన్నాయని తెలిసినా వాటిని పరిష్కరించడంలో జాప్యం చేయడం సమంజసం కాదన్నారు. విద్యార్థుల సమస్యలను కేవలం తెలుసుకోవడానికే పరిమితం కాకుండా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. అవసరమైతే విద్యార్థులను సమీకరించి ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యవర్గ సభ్యులు షబాజ్, సందీప్, అతీఫ్, జస్వంత్,

పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు కావాలి

బీఆర్ఎస్ నాయకుల పిలుపు
ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలి



కీసర, నవంబర్ 05 (జనంసాక్షి) : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటు హక్కు కోసం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. నాగారం డివిజన్ వార్డు కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య ప్రక్రియలో పట్టభద్రులు భాగస్వాములు కావాలంటే ముందుగా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నాగారం డివిజన్ పరిధిలోని అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పట్టభద్రుల సౌకర్యార్థం నాగారం డివిజన్ వార్డు కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉచితంగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కౌకుంట్ల అనంత్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తేల్లశ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బండారి శ్రీకాంత్ యాదవ్, అన్నంరాజు శ్రీనివాస్, చిన్నంరాజు సాయినాథ్ గౌడ్, అన్నంరాజు సంజీవ, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ విగ్నేష్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ పులకుర్తి సంపత్ కుమార్, కొప్పుల మల్లేష్ తదితులు పాల్గొన్నారు.



ఆపదలో ఆదుకుని.. మానవత్వం చాటుకుని



కీసర, నవంబర్ 05 (జనంసాక్షి) : దొంగతనంతో జీవనాధారం కోల్పోయిన బాధిత కుటుంబానికి సామాజిక కార్యకర్త అక్కాల సురేష్‌కుమార్ అండగా నిలిచారు. నాగారం డివిజన్‌లో పది రోజుల క్రితం అన్నంరాజు అంజమ్మ ఇంట్లో దొంగలు పడి రూ.30 వేల నగదుతో పాటు, జీవనోపాధికి ఆధారమైన ఇస్త్రీ పెట్టెను అపహరించారు. విషయం తెలుసుకున్న సురేష్‌కుమార్ గురువారం అంజమ్మను పరామర్శించి, తన వంతుగా రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా నాగారం డివిజన్‌లో పోలీసు పెట్రోలింగ్ పెంచి దొంగతనాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

గర్భిణులు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్
వైద్య పరీక్షలు, టీకాల లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలి
బోలక్‌పూర్ పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీ



హైదరాబాద్, నవంబర్ 05 (జనంసాక్షి) : గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు క్రమం తప్పకుండా అందించాలని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. గురువారం అంబర్‌పేట పరిధిలోని బోలక్‌పూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, ఔషధాల నిల్వలు, ల్యాబొరేటరీ, వైద్య రికార్డులు, పరిశుభ్రతను తనిఖీ చేశారు. గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న సేవలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమీక్షించారు. అర్హులైన పిల్లలందరికీ 100 శాతం టీకాలు అందించి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. టీకాల నిల్వ, శీతలీకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. నాన్ కమ్యూనికేబుల్ వ్యాధుల సర్వే, స్క్రీనింగ్, ఫాలోఅప్ ప్రతిరోజూ నిర్వహించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అర్హులైన బాలికలకు హెచ్‌పీవీ టీకాలు త్వరితగతిన వేయించాలని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో అన్ని రకాల మందుల నిల్వలు ఉండాలని స్పష్టం చేశారు. మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఇంటింటి సర్వేలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయిబాబా పాల్గొన్నారు.





గండిపేటలో రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి



రాజేంద్రనగర్,నవంబర్5(జనంసాక్షి) : గండిపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బొంకు అజయ్ (20) అనే యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 4వ తేదీ రాత్రి అజయ్ తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా, గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ ఎత్తి రోడ్డు ప్రమాదంలో అజయ్ మృతి చెందినట్లు సమాచారం ఇచ్చాడు. దీంతో వారు ప్రమాద స్థలానికి చేరుకోగా, గండిపేట ప్రభుత్వ పాఠశాల వెనుక హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ గోడ వద్ద తీవ్ర గాయాలతో అజయ్ మృతి చెంది కనిపించాడు. శంకర్‌పల్లి రోడ్డు నుంచి గండిపేట వైపు బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ గోడను ఢీకొని ప్రమాదానికి గురైనట్లు ప్రాథమికంగా తెలిసింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న షేక్ నబీ రసూల్ కుడి కాలు, చేతికి గాయాలయ్యాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అచ్చంపేటలో రూ.30 లక్షలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



శంషాబాద్, నవంబర్5(జనం సాక్షి) : గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ అన్నారు. పిల్లోనిగూడ గ్రామ అనుబంధ గ్రామమైన అచ్చంపేటలో రూ.30 లక్షల నిధులతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నీరటి తన్వి రాజు, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ పాసుగంటి స్వర్ణలత నరసింహా, ఉపసర్పంచ్ పిల్లి శ్రీశైలం ముదిరాజ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కోటేశ్వర్ గౌడ్, చౌదరిగూడ సర్పంచ్ లక్ష్మీ లింగం, సుల్తాన్‌పల్లి సర్పంచ్ ప్రభాకర్ గౌడ్, షాపూర్ తండా సర్పంచ్ రవి నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్, వార్డు సభ్యులు విజయలక్ష్మి, దివ్య, కె. శ్యామల, నాయకులు కె. నరసింహా, జుర్కి రమేష్ పటేల్, పి. సుధాకర్, మహేష్, గణేష్, కిష్టయ్య, దశరథ్, శ్రీకాంత్ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ నూతన కమిషనర్‌కు శుభాకాంక్షలు
ముషారఫ్ అలీ ఫారూఖీని కలిసిన డీఎంహెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 05 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నూతన డైరెక్టర్/కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.డి.ముషారఫ్ అలీ ఫారూఖీ, ఐఏఎస్ ను మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా వైద్యఆరోగ్య అధికారి డాక్టర్ కె.ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి, నూతన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

వచ్చే ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పని చేయాలి
కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనుగు జలంధర్ రెడ్డి



బోడుప్పల్-జనంసాక్షి : రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమిష్టిగా ఒని చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎనుగు జలంధర్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి పార్టీ గెలుపు కోసం పనిచేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ లో కార్యకర్తలు రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళేలా ఐక్యంగా పని చేయాలని సూచించారు.కార్యకర్తలు ఎవ్వరూ కూడా పార్టీ లైన్ దాటకుండా క్రమశిక్షణతో ఉండాలని కార్యకర్తలకు సూచించారు.

హైదరాబాద్‌లో తాగునీటి సంక్షోభం

కాంగ్రెస్ ప్రభుత్వంపై మన్నె గోవర్ధన్ రెడ్డి ఆగ్రహం

సైబరాబాద్ పరిధిలో 2,500కు పైగా పీజీ హాస్టళ్లకు నీటి కష్టాలు

రోజుకు 8 వేలకుపైగా ట్యాంకర్ బుకింగ్‌లు,

శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్



ఖైరతాబాద్, నవంబర్ 05 (జనం సాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో హైదరాబాద్ ప్రజలు తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్లోబల్ సిటీ పేరుతో ప్రచార ఆర్భాటాలకు ప్రాధాన్యత ఇస్తోందని, కానీ ప్రజలకు కనీసం తాగునీరు అందించడంలో విఫలమైందని మండిపడ్డారు. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. సైబరాబాద్ పరిధిలో 2,500కు పైగా పీజీ హాస్టళ్లు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, రోజుకు 8 వేలకుపైగా ట్యాంకర్ బుకింగ్‌లు నమోదవుతున్నాయని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో నాలుగైదు రోజులైనా నీటి సరఫరా జరగకపోవడంతో ప్రజలు ట్యాంకర్లు, బాటిళ్లపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. వేసవి ప్రారంభం కాకముందే వేలాది బోర్లు ఎండిపోతుండటం నీటి సంక్షోభ తీవ్రతకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. నీటి కొరతను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ట్యాంకర్లు అధిక ధరలు వసూలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో మధ్యతరగతి కుటుంబాలు నీటి కోసం అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్య కారణంగా పీజీ హాస్టళ్లు మూతపడుతున్నాయని, విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులకు పరిమితం అవుతున్నారని, ఐటీ ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. చదువుల కోసం హైదరాబాద్‌కు వచ్చిన విద్యార్థులు నీటి కొరతతో సొంతూళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి రావడం నగర అభివృద్ధికి నిదర్శనమా? అని ప్రశ్నించారు. కృష్ణా, గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకునే ప్రణాళిక ఏమైందని, పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా శాశ్వత తాగునీటి సరఫరా వ్యవస్థను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రచార ఆర్భాటాలు, సమీక్షలతో కాలయాపన చేయకుండా ప్రజల దాహార్తిని తీర్చడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని మన్నె గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరానికి నిరంతర తాగునీటి సరఫరా అందించేలా తక్షణ చర్యలు చేపట్టి, నీటి సంక్షోభానికి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు.

అల్లుకున్న నిర్లక్ష్యం.. ప్రమాదం పొంచి ఉంది

విద్యుత్ తీగలకు అల్లుకున్న తీగజాతి మొక్కలు..

గాలులకు మంటలు వస్తున్నాయంటున్న స్థానికులు



కీసర, నవంబర్ 05 (జనంసాక్షి): విద్యుత్ తీగలకు అల్లుకున్న మొక్కలతో ప్రమాదం పొంచి ఉంది. కీసర సర్కిల్ లోని దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని సైలెంట్ ఎవెన్యూ కాలనీలో విద్యుత్ స్తంభం, తీగలకు తీగజాతి మొక్కలు అల్లుకోవడంతో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. గాలులు వీచినప్పుడు తీగల వద్ద మంటలు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఏ క్షణంలో ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ తీగలకు మొక్కలు అల్లుకున్నా సంబంధిత అధికారులు సకాలంలో స్పందించకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ షాక్, అగ్నిప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా వెంటనే మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.



వెంటనే తొలగిస్తాం.. ఏఈ

ఈ విషయమై దమ్మాయిగూడ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా.. సిబ్బంది ఇతర పనుల్లో ఉన్నారని, విద్యుత్ తీగలకు అల్లుకున్న మొక్కలను వెంటనే తొలగిస్తామని తెలిపారు.

పర్వతాపూర్‌లో భారీ నిర్మాణం.. టౌన్‌ప్లానింగ్ మౌనం

ప్రధాన రహదారి పక్కనే మూడు అంతస్తులు, పైగా పెంట్‌హౌస్ నిర్మాణం

అనుమతులు ఉన్నాయా? నిబంధనల ఉల్లంఘనపై అధికారుల విచారణ ఏది?



బోడుప్పల్-జనంసాక్షి

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ పర్వతాపూర్ గ్రామకంఠంలో భారీ భవన నిర్మాణంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన రహదారి పక్కనే మూడు అంతస్తులతో పాటు పెంట్‌హౌస్ నిర్మాణం చేపడుతున్నప్పటికీ సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణ అనుమతులు, ఆమోదిత భవన ప్రణాళికపై స్పష్టత లేకపోవడంతో స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కళ్ల ముందే నిర్మాణం.. పర్యవేక్షణ ఏది?

మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షణ ఉన్నప్పటికీ ఇంత భారీ భవన నిర్మాణం కొనసాగుతుండటంపై స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? ఆమోదించిన ప్రణాళిక ప్రకారమే పనులు జరుగుతున్నాయా? అదనపు అంతస్తులు, పెంట్‌హౌస్ నిర్మాణానికి నిబంధనలు అనుమతిస్తున్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. చిన్న నిర్మాణాల విషయంలోనూ స్పందించే అధికారులు, ఈ భవన నిర్మాణంపై ఎందుకు తనిఖీలు చేపట్టడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఉన్నతాధికారులు స్పందించేనా?

మున్సిపల్ ఉన్నతాధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నిర్మాణ అనుమతులు, భవన ప్రణాళికను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే నిర్మాణ పనులను నిలిపివేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పర్వతాపూర్‌లో జరుగుతున్న ఈ నిర్మాణంపై అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడిస్తారా? లేక ఫిర్యాదులు వచ్చే వరకు వేచి చూస్తారా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

శామీర్‌పేట్‌లో ఘనంగా అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు



శామీర్ పేట, నవంబర్ 5 (జనంసాక్షి) : అమ్మవారి పలహారం బండిని ఘనంగా ఊరేగించారు. మండల కేంద్రం శామీర్ పేట శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణంలో భాగంగా బోనాల అనంతరం రాత్రికి అమ్మవారి ఫలహారం బండిని ఊరేగించారు. శామీర్ పేట కెనరా బ్యాంకు సమీపం నుంచి గొర్రె పొట్టేళ్ల వాహనంపై అమ్మ వారిని ఏర్పాటు చేసి పలహారం బండిని ఆలయం వరకు ఊరేగించారు. యువకులు ఎంతో ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వ హించారు. మహిళలు, యువతులు ఉత్సాహంతో పాల్గొని నృత్యాలు చేశారు.

పంటలు పచ్చగా ఉన్నాయి : ఎమ్మెల్యే

పంటలు ఎండుతున్నాయి : మాజీ ఎమ్మెల్యే

పంట పొలాల్లో పర్యటించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి(జనంసాక్షి) పంట పొలాలు పచ్చగా ఉన్నాయని బిఆర్ఎస్ నేతలు పచ్చని పంట పొలాలను చూసి జీర్ణించుకోలేకనే అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారని షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారంనాడు ఫరూక్ నగర్ మండలం చించోడ్, కిషన్ నగర్, చౌల్లపల్లి, గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులతో కలిసి వరి పంట పొలాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓవైపు అభివృద్ధి పరుగులు పెడుతుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. రైతులకు ప్రభుత్వం అదనంగా మరో మూడు గంటల విద్యుత్ ను, అందిస్తుందని తెలిపారు ఎక్కడో సాంకేతిక లోపాల వాళ్లను ఇతర కారణాల వాళ్లను చిన్నపాటి పంటలు ఎండిపోతే దాన్ని పట్టుకొని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. తమ ప్రభుత్వం రైతులకు సకాలంలో రైతుబంధు ఇతర సంక్షేమ పథకాలను అందిస్తుందని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నాయకులు రైతుల ముసుగులో గులాబీ కండువాలు వేసుకొని రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు..

కరువు కాటేస్తున్న కదలని సర్కార్ : వై.అంజయ్య యాదవ్

పల్లెల్లో కరువు ఛాయలు అలుముకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీరు, విద్యుత్ కొరతతో పంటలు ఎండిపోతుంటే రైతులు దిక్కుతోచని స్థితిలో కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు.గురువారం ఫరూఖ్‌నగర్ మండలంలోని కడియాలకుంట తండాతో పాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎండిపోయిన పంటలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి పంట నష్టానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనే రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని ఆరోపించారు. వర్షాకాల ప్రారంభంలో గోదావరి, కృష్ణా నదుల్లో పుష్కలంగా వరద నీరు ప్రవహించినా, ఆ నీటిని సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని విమర్శించారు.పాలమూరు ప్రాంతంలో కరువు పరిస్థితులు కొత్తేమీ కాదని, అయినప్పటికీ రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. యాసంగి సాగు సమయం సమీపిస్తున్నా రైతు భరోసా ఎప్పుడు ఇస్తారు ఎంత ఇస్తారు అనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదన్నారు. రైతులను ఏ విధంగా ఆదుకుంటారో చెప్పలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు.ఒకవైపు సాగుకు సరిపడా విద్యుత్ అందడం లేదని, మరోవైపు సాగునీటి వసతి లేక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా మెరుగ్గా ఉందని చెబుతున్న ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో ఎండిపోతున్న పంటలకు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు.

డంపింగ్ యార్డును తరలించాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త అశోక్ గౌడ్
జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన
అదనపు కలెక్టర్ కిరణ్మయికి వినతి
కొంగరకలాన్ ప్రజలను రోగాలపాలు చేయొద్దు



రంగారెడ్డి, నవంబర్ 5 (జనంసాక్షి): కొంగరకలాన్ లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును తరలించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో కొంగరకలాన్ డంపింగ్ యార్డు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంగరకలాన్ ప్రజలను రోగాలపాలు చేయొద్దన్నారు. కొంగరకలాన్ పరిధిలోని కలెక్టరేట్ , సాఫ్ట్‌వేర్ సంస్థలు, పెద్దమ్మ గుడి, బీరప్ప ఆలయం ఉన్నా అక్కడే బోడబండ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేసి కలుషితం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



తక్షణమే అక్కడ నుంచి డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్య భద్రతను కల్పించాల్సిన ప్రభుత్వం ప్రాణాలు తీస్తుందన్నారు. డంపింగ్ యార్డ్ వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. దుర్గంధంతో పాటు పరిశుభ్రత లోపించి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాత్రిపూట బాగా ఉంచు విపరీతంగా పేరుకుపోతుందని ఆందోళన వెలిగించారు. తాగే నీటి సైతం కలుషితమవుతుందన్నారు. పొగ మంచుతో పిల్లలకు శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని ఆందోళన వెలుగు చారు. అనంతరం జిల్లా కలెక్టర్ సీ నారాయణ రెడ్డి, జాయింట్ కలెక్టర్ కిరణ్మయికు వినతి పత్రం అందజేశారు. తమ వినతిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, రాబోయే పది రోజుల్లోపు డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి తరలిస్తామని హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొక్క నరసింహారెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డి, బోసుపల్లి ప్రతాప్, నారాయణ యాదవ్, శ్రీదేవి, కొత్త రామ్‌రెడ్డి, జక్క రవీందర్ రెడ్డి, తుల నరసింహ గౌడ్, ఏ. నరసింహారెడ్డి, బొచ్చుగల రమేష్, పురుషోత్తం, రమణారెడ్డి, పెళ్లి శ్రీనివాస్, కట్ట సాయి, లక్ష్మీపతి గౌడ్, వీరస్వామి గౌడ్, ఆర్. నరసింహ, హరి శంకర్ గౌడ్, భాస్కర్ నాయక్, రమేష్ నాయక్, కిషన్ నాయక్, శ్రీనివాస్ నాయక్, రాఘవేంద్ర గౌడ్, రాజు, యాదయ్య గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ ఆరా



ఉప్పల్, నవంబర్ 5 (జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఉప్పల్ మండల సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, పాఠశాలలో అందుతున్న భోజనం నాణ్యతతో పాటు విద్యా సదుపాయాలు, మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నెలకొన్న అపరిశుభ్రతను నాయకులు గుర్తించారు. వారం రోజులుగా పాఠశాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలను తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పల్ శానిటేషన్ అధికారి నీలిమ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎండీ. అజీమ్ పాషా, జీ. మహేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు పాఠశాలను సందర్శించామని తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యవర్గ సభ్యులు షాజ్, సందీప్, అతీఫ్, జస్వంత్, రియాన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అండగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం

చంద్రశేఖర్ అనాథాశ్రమంలో సామాజిక సేవా కార్యక్రమం

హయత్ నగర్, నవంబర్ 5 (జనంసాక్షి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్‌లోని ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని చంద్రశేఖర్ అనాథాశ్రమంలో సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, కరుణ, సేవాభావం, మానవతా విలువలను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ సందర్భంగా అనాథాశ్రమంలోని పిల్లల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సుమారు రూ.10,000 విలువైన మూడు బస్తాల బియ్యం, పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు, పండ్లు, గుడ్లు మరియు ఇతర నిత్యావసర సరుకులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేష్ బాబు ఈ కార్యక్రమానికి తన వంతు సహాయంగా రూ.5,000 విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు చురుకుగా పాల్గొని అనాథాశ్రమంలోని పిల్లలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. వారితో సంభాషిస్తూ, ప్రోత్సాహకరమైన మాటలు చెబుతూ జీవితంలో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం మరియు సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు.





ఈ పరస్పర సంభాషణ విద్యార్థుల్లో సానుభూతి, సామాజిక స్పృహ మరియు మానవతా విలువలను మరింత పెంపొందించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేష్ బాబు మాట్లాడుతూ, అనాథాశ్రమ వ్యవస్థాపకులు చంద్రశేఖర్ ఎంబీఏ పూర్తి చేసిన అనంతరం తన జీవితాన్ని అనాథ పిల్లల సేవకు అంకితం చేసి, వారి విద్యాభివృద్ధి, సంక్షేమం మరియు అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేయడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన సేవా నిరతిని, అంకితభావాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆంగ్ల విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. మక్లా, డాక్టర్ పి. విజయలక్ష్మి, పి. విద్యాసాగర్, డాక్టర్ వి. కృష్ణమోహన్, డాక్టర్ జి. ప్రవీణ్ కుమార్, డాక్టర్ ఎ. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, మానవతా దృక్పథం మరియు సమాజం పట్ల బాధ్యతను పెంపొందించడంతో పాటు, అనాథాశ్రమంలోని పిల్లలకు అవసరమైన సహాయాన్ని అందించి వారిలో ప్రోత్సాహం, ఆత్మవిశ్వాసం నింపగలిగారు.



పూడూరు మండలంలో జోరుగా సీసీ రోడ్డు

జనంసాక్షికి స్పందన



పూడూరు సెప్టెంబర్ 05 (జనంసాక్షి): పూడూరు మండలంలోని గవర్నమెంట్ స్కూల్ దగ్గర నుండి పూడూర్ గేట్ వరకు సిసి రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి ఈ సీసీ రోడ్డు పనులు సర్పంచ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నది జనం సాక్షి దిన పత్రికకు స్పందన వచ్చింది అని పూడూరు మండల గ్రామ ప్రజలు తెలియజేశారు ఈ రోడ్డు పనులు ఎన్నో రోజుల నుండి పెండింగ్ లో ఉన్నందున జనం సాక్షి లో సిసి రోడ్డు పనుల గురించి వేయడం జరిగింది దీనికి గ్రామ ప్రజలు మురిసిపోతున్నారు

చిల్కానగర్‌లో నూతన హంగులతో షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

రూ.45 లక్షలతో ఇండోర్ స్టేడియం ఆధునీకరణ..
క్రీడాకారులకు అందుబాటులోకి సౌకర్యాలు



ఉప్పల్, నవంబర్ 5 (జనం సాక్షి): చిల్కానగర్ డివిజన్ పరిధిలోని ఉప్పల్ ఇండోర్ షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు నూతన హంగులతో ముస్తాబైంది. సుమారు రూ.45 లక్షల వ్యయంతో చేపట్టిన ఆధునీకరణ పనులు పూర్తికావడంతో గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జోనల్ కమిషనర్ రాధిక గుప్తా లాంఛనంగా ప్రారంభించారు. దీంతో నేటి నుంచి క్రీడాకారులకు స్టేడియంలో బ్యాడ్మింటన్ ఆడుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ రాధిక గుప్తా మాట్లాడుతూ.. సుమారు ఎనిమిది సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియానికి ప్రస్తుతం రూ.45 లక్షల నిధులతో పూర్తిస్థాయిలో పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. స్టేడియంలోని వుడెన్ ఫ్లోర్ మరమ్మతులు, లోపల, బయట పెయింటింగ్, ఫ్లోర్ మ్యాట్స్ ఏర్పాటు చేయడంతో పాటు నూతన విండోస్, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు, కుర్చీలు, లాకర్లు తదితర సౌకర్యాలను సమకూర్చినట్లు వివరించారు. క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో అన్ని పనులను నాణ్యతతో పూర్తి చేశామని, ఇకపై ఈ స్టేడియాన్ని క్రీడాకారులు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గంలో క్రీడా మైదానాలు, ఆటస్థలాలు, పార్కులు, ఓపెన్ జిమ్‌ల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. ప్రజలకు అత్యంత అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నట్లు వెల్లడించారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి, ముఖ్యంగా క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు సమకూర్చడంలో సహకరిస్తున్న ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి, జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో మరింత రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఉప్పల్ ఎంఎంసీ అధికారులు, షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్లకొండ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య



నవాబుపేట్ నవంబర్ 5(జనం సాక్షి): నవాబుపేట్ మండల పరిధిలోని ఎల్లకొండ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య గ్రామ ఆధ్వర్యంలో గురువారం ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. గ్రామానికి చెందిన మేకల అనుష భర్త సుధాకర్ కాయ కష్టం చేసి ఉండడానికి ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సందర్భంగా గత నాలుగు నెలల క్రితం ఇందిరమ్మ ఇళ్ళను దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్రంలోని ఇచ్చినటువంటి ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలోని ఇల్లు లేని పేద ప్రజలందరికీ ఇల్లు కావాలని దరఖాస్తు చేసుకున్న వారికి ఇల్లు మంజూరు చేసిన ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇండ్లు మంజూరు చేసిన వెంటనే ఇల్లు కట్టుకుంటున్న గ్రామ ప్రజలు నిర్మించుకుంటున్న ఆధ్వర్యంలో ఇంటిని ప్రారంభించడానికి చేవెళ్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావు గారి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి పేద ప్రజలందరికీ ఇల్లు లేని వారికి ఇంటిని నిర్మించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఇంటి స్థలంలో 600 గజాలలోపు ఉన్నవారికి ఇంటిని నిర్మించడానికి ఐదు లక్షల రూపాయల ప్రభుత్వము ఇస్తుందని ఆయన తెలిపారు. ఇంటి స్థలం ఉన్నవారికి ప్రభుత్వం అండగా నుండుగా నూరేళ్లు ఇంటిని నిర్మించే విధంగా ఐదు లక్షల రూపాయలు ఇస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఇంటిని పూర్తిగా నిర్మాణాన్ని పూర్తిచేసిన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలో ఇంటిని ప్రారంభించారు. గ్రామస్తుల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామం పంచాయతీ వార్డు సభ్యులు. పిఎసిఎస్ చైర్మన్ అసిరెడ్డిగారి రంగారెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, డైరెక్టర్ ఖదీర్,కందడ నరసింహారెడ్డి,చిట్టీపు రాజశేఖర్ రెడ్డి, అత్తాపురం సర్పంచి సంతోష్ రెడ్డి,దాతపూర్ బలవంత్ రెడ్డి, గుబ్బిడి పత్తపూర్ సర్పంచ్ మేకల సాయన్న మండల సీనియర్ నాయకుడు నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్, లింగం, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు గ్రామ మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు, యువజన సంఘాల నాయకులు మహిళ సంఘాల నాయకురాలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



7వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

యాచారం, నవంబర్ 05(జనం సాక్షి) : యాచారం మండలం తక్కళ్ళపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 7వ వార్డులో ప్రజల చిరకాల కోరికైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం స్థానిక సర్పంచ్ మారేడుపల్లి నరేందర్ రెడ్డి , 7వ వార్డు సభ్యులు కంబాలపల్లి వెంకటేష్ తో కలిసి ఘనంగా ప్రారంభించారు. చాలాకాలంగా ఈ వార్డులోని రోడ్డు దెబ్బతిని రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకొని, వార్డు అభివృద్ధే ధ్యేయంగా గ్రామ పంచాయతీ నిధులతో ఈ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మరియు వార్డు సభ్యులు మాట్లాడుతూ... గ్రామ సమగ్ర అభివృద్ధితో పాటు ప్రతి వార్డులోనూ మౌలిక వసతుల కల్పనకు తమ పాలకవర్గం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కంబాలపల్లి సువర్ణ, వార్డు సభ్యులు ఆవుట్ మహేందర్, మార్యాపురం కృష్ణ, వలవోతు మంజుల, పంబలి శిల్ప, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కంటేకార్ తులసి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి : బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్

అల్వాల్, నవంబర్ 5(జనంసాక్షి): రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అర్హులైన పట్టభద్రులం దరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్ సూచన మేరకు వెంకటాపురంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకొని రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీణా సుధేష్, ఆశారాణి, లక్ష్మి, సురేష్ రెడ్డి, ముత్యాలు, కన్నా, నాని, నాగరాజు, సురేష్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దామరగిద్దలో విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు

24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేస్తాం

చేవెళ్ల, నవంబర్ 05 (జనంసాక్షి) : చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు దామరగిద్దలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కాలే యాదయ్య చొరవ తీసుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే సూచన మేరకు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డితో కలిసి స్థానిక కౌన్సిలర్ తాళ్లపల్లి నర్సింహులు, మాజీ సర్పంచ్ రెడ్డిశెట్టి మధుసూదన్ గుప్త విద్యుత్ శాఖ ఏడీఈ సాయినాథ్, ఏఈ రాజేందర్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. దామరగిద్దలో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతుండటంతో స్థానిక ప్రజలు, వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు వివరించారు. విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను త్వరితగతిన గుర్తించి పరిష్కరించాలని, వార్డులో 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు దామరగిద్దలో విద్యుత్ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కాలే యాదయ్య సానుకూలంగా స్పందించడంపై స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, మద్దెల శ్రీనివాస్, గ్రామస్తులు దొడ్డి మల్లేష్, సత్తయ్య, అక్కాపురం నర్సింలు పాల్గొన్నారు.

కల్వ సుజాత గుప్త గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి.. పెద్ది నాగరాజు గుప్తా



కాప్రా, నవంబర్ 4 (జనం సాక్షి) : కల్వ సుజాత గుప్త గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి వాసవి మిత్ర మండలి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్తా అన్నారు. గురువారం వాసవి మిత్ర మండలి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రేబెల్లి శ్రీనివాస్ గుప్తా, కాప్రా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వైవియూ నాగేశ్వరరావుతో కలిసి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ని కలిసి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రాబోయే గవర్నర్ కోటాలో అహర్నిశలు పార్టీ కోసం కొనసాగుతున్న కల్వ సుజాత గుప్త కు ఎమ్మెల్సీ ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లాలని వారు పరమేశ్వర్ రెడ్డిని కోరి వినతిపత్రం అందజేస్తారు. ఈ కార్యక్రమంలో కాప్రా ఆర్యవైశ్య ప్రముఖులు వాసవి మిత్ర మండలి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాప్రా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్ది శ్రీనివాస్, గుప్తా బెలిదే భగవాన్ గుప్తా,చంద్రగిరి తాడకేశ్వర్ గుప్తా, గజ్జల రమేష్ గుప్తా,కండే శివకుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఓటు బచావో - దేశ్ బచావో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్ శ్రేణులకు బండి రమేష్ అభినందనలు



కూకట్‌పల్లి, నవంబర్ 5(జనంసాక్షి): ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు నిర్వహించిన 'ఓటు బచావో – దేశ్ బచావో' కార్యక్రమాన్ని విజయవంతం చేసి తిరిగి వచ్చిన కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులకు గురువారం ఘనంగా అభినందనలు తెలిపారు. కూకట్ పల్లిలోని హేమదుర్గ భవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన కార్యక్రమానికి కూకట్‌పల్లి నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బస్సుల ద్వారా తరలివెళ్లి విజయవంతం చేయడం అభినందనీయ మన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉద్యమంలో ప్రతి ఒక్కరూ ఐక్యంగా భాగస్వాములు కావడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, రానున్న రోజుల్లోనూ పార్టీ చేపట్టే ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమాల్లో ఇదే ఉత్సాహంతో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

తలకొండపల్లి సింగల్ విండో చైర్మన్ పదవిని బీసీలకే కేటాయించాలి

- **లేకుంటే బీసీలకు ఆగ్రహం తప్పదు..**
- **తలకొండపల్లి మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గుజ్జారి రాఘవేందర్**



తలకొండపల్లి నవంబర్ 05(జనంసాక్షి): తలకొండపల్లి మండల సింగల్ విండో చైర్మన్ పదవిని బీసీలకే కేటాయించాలని మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గుజ్జారి రాఘవేందర్ డిమాండ్ చేశారు.గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో సింగల్ విండో చైర్మన్‌గా గత 21సంవత్సరాలుగా ఒకే సామాజిక వర్గానికి చెందిన నేతకు పదవిని అప్పగించడం రాజుల కాలం గుర్తు చేస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలోజనాభా దామాషా ప్రకారం పదవులను కేటాయించాలన్నారు.మండలంలో అత్యధిక జనాభా కలిగిన బీసీ వర్గానికి ఇప్పటివరకు సరైన ప్రాధాన్యత దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు.బీసీలు లేకుండా గ్రామాల్లో వ్యవసాయం, సహకార వ్యవస్థ ముందుకు సాగదని స్పష్టం చేశారు.రైతులకు ఎరువులు,విత్తనాలు,రుణాలు అందించే సింగల్ విండోలో బీసీ నాయకత్వం ఉంటేనే న్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు రాజకీయంగా,సామాజికంగా గుర్తింపు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు.చైర్మన్ పదవిలో బీసీని నియమిస్తేనే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఎంపీ మల్లు రవి,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,లు ప్రత్యేక చొరవ తీసుకొని తలకొండపల్లి సింగల్ విండో చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించాలని కోరారు.బీసీల ఐక్యతే మన బలం అని,అందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు.ఈ డిమాండ్ నెరవేరే వరకు బీసీ నాయకులు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్,బీసీ సంఘం నాయకులు వెంకటయ్య,బాల కుమార్ గౌడ్ ఉన్నారు.

ఆమనగల్ సింగిల్ విండో చైర్మన్‌గా శ్రీనివాస్ రెడ్డి నియామకం



కడ్తాల్ నవంబర్ 05 (జనంసాక్షి): ఆమనగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన డీసీసీ ఉపాధ్యక్షుడు,ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి,ని నియమితులయ్యారు.కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సింగల్ విండో చైర్మన్ గా గూడూరు శ్రీనివాస్ రెడ్డి పేరును ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.దీంతో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు గూడూరు శ్రీనివాస్ రెడ్డి,ని చైర్మన్ గా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.మూడు దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా గూడూరు శ్రీనివాస్ రెడ్డి సేవలందిస్తున్నారు.

కడ్తాల్ సర్పంచ్‌గా, ఉప సర్పంచ్‌గా,ఎంపీటీసీ సభ్యుడిగా గూడూరు శ్రీనివాస్ రెడ్డి 15 ఏళ్లు సేవలందించారు. యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా,జిల్లా ప్రధాన కార్యదర్శిగా,డీసీసీ కార్యదర్శిగా, జిల్లా అధికార ప్రతినిధిగా పనిచేశారు. కడ్తాల్ గ్రామాభివృద్ధికి శ్రీనివాస్ రెడ్డి తనవంతు కృషి చేశారు.వివిధ పదవుల ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.కడ్తాల్ మండల సాధన పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించారు.డీసీసీ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరుతూ దరఖాస్తు చేసుకున్నప్పటికీ సామాజిక సమీకరణాల నేపథ్యంలో మహిళకు అవకాశం రావడంతో సింగల్ విండో చైర్మన్ గా శ్రీనివాస్ రెడ్డి,కి అవకాశం కల్పించారు.స్థానిక సంస్థల రిజర్వేషన్ల మూలంగా అవకాశం వస్తుందో,రాదోనన్న భావనతో శ్రీనివాస్ రెడ్డి తనకు నామినేటెడ్ పోస్టులో అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమనగల్,కడ్తాల్ మండలాల ఉమ్మడి సింగల్ విండో చైర్మన్ గా అవకాశం కల్పించారు.కాగా,డైరెక్టర్లుగా 12 మందికి అవకాశం లభించింది.డైరెక్టర్లుగా కాలే మల్లయ్య,దేవపట్ల ఆనంద్ కుమార్,గోరె యాదమ్మ,వరగని వెంకటమ్మ,నిట్ట నారాయణ,తల్లోజు పెంటమ్మ,కర్నాటి భగనాన్ రెడ్డి,నక్కపోతు నర్సింహా,ధ్యాసాని బాల్ రెడ్డి,నేనావత్ సీతారాం,నేనావత్ రాజు,కేతావత్ కీషన్ లు నియమితులయ్యారు.

మాడ్గుల సింగల్ విండో చైర్మన్‌గా వెంకటేశ్వర్లు గౌడ్ నియామకం

మాడ్గుల మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించింది.బుధవారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడాయి.కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సిఫార్సు మేరకు 13 మందితో నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా యాచారం వెంకటేశ్వర్లు గౌడ్,ను నియమించగా, డైరెక్టర్లుగా మరో 12 మందికి అవకాశం కల్పించారు.డైరెక్టర్లుగా వెంకట్రామిరెడ్డి, ఇటికాల విజయమ్మ,ఏసూరు యాదమ్మ,నీరెడు నర్సింహా, నేనావత్ విష్ణు, మస్న విష్ణు, సత్యయ్య, కసిరెడ్డి రాంరెడ్డి, గుండె వెంకటేష్, కాట్రావత్ సురేశ్, జంగయ్య, ఆరోగ్యరెడ్డిలను నియమించారు.

ముదిరాజ్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



కొడంగల్, నవంబర్ 5 (జనం సాక్షి):

కొడంగల్ కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి గారిని ముదిరాజ్ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ముదిరాజ్ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు.ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లి, నిధుల మంజూరుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.ముదిరాజ్ సామాజిక వర్గానికి భవనాలు ఎంతో అవసరమని, సంఘ కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా భవనాల నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో లగచెర్ల సురేష్ ముదిరాజ్, కూర వెంకటయ్య ముదిరాజ్, కావలి సాయిలు తో పాటు పలువురు ముదిరాజ్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అర్కతల గ్రామంలో అండర్ డ్రైనేజీ సిసి రోడ్డు పనులు ప్రారంభించిన గ్రామ సర్పంచ్ గంజాయి రేణుక రాములు



నవాబుపేట్ నవంబర్ 5 (జనంసాక్షి): మండల పరిధిలోని అర్కతల గ్రామంలో గురువారం అండర్ డ్రైనేజీ సిసి రోడ్ల పనులు ప్రారంభించిన గ్రామ సర్పంచ్ గంజాయి రేణుక రాములు. చేవెళ్ల శాసనసభ్యులు ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలో 40 లక్షల మంజూరు చేసిన సందర్భంగా హనుమాన్ మందిరం నుండి స్కూల్ వరకు, పోచమ్మ టెంపుల్ నుండి గ్రామం పంచాయతీ కార్యాలయం వరకు అండర్ డ్రైనేజీ సిసి రోడ్లను తానికల్ గ్రామానికి ఇచ్చిన గ్రామంలో ఉన్న సమస్యలను పూర్తిగా తీర్చి దిద్దడానికి సర్పంచ్ గా బాధ్యతలు స్వీకరించాలని రేణుక రాములు తెలిపారు. గ్రామంలోని సమస్యలు సర్పంచి ఎన్నికల ఆధ్వర్యంలో ఇచ్చిన హామీలను పూర్తి చేయడమే నా లక్ష్యం అంటున్నారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి సర్పంచ్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నానని రేణుక అన్నారు. గ్రామంలోని ఏ సమస్యలు ఉన్న తనకు సమాచారం ఇచ్చినట్లయితే వెంటనే గ్రామ సమస్యలు తీర్చి దిద్దుతానని ఆమె అన్నారు.గ్రామంలో సిసి రోడ్లు అండర్ డ్రైనేజీ, సిసి రోడ్లు , విధి లైట్లు. గ్రామ సమస్యలు పూర్తిగా తీర్చి దిద్దుతానని ఆమె తెలిపారు. గ్రామ సర్పంచ్ రేణుకరాములు పంచాయతీ కార్యదర్శి స్వప్న ఆధ్వర్యంలో డ్రైనేజ్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో మాజీ పి ఏ సి ఎస్ చైర్మన్ రామిరెడ్డి, గ్రామ ఉపసర్పంచి శివనీల భాగయ్య, మాజీ సర్పంచ్ వడ్డీ రాములు, మాజీ ఎంపిటిసి తలారి యాదయ్య, దేవయ్య,వార్డు సభ్యులు వెంకటయ్య, మాణిక్యం,కారోబార్ లక్ష్మయ్య పంచాయతీ వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు యువజన సంఘాల నాయకులు ద్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

హయత్ నగర్ జాతీయ రహదారిపై ట్రాఫిక్

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి కళ్లెం నవజీవన్ రెడ్డి



హయత్ నగర్, నవంబర్ 5 (జనం సాక్షి) : ట్రాఫిక్ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మాజీ కార్పొరేటర్ – అధికారులతో ప్రత్యేక సమీక్ష హయత్ నగర్ జాతీయ రహదారిపై నిత్యం ఏర్పడుతున్న తీవ్రమైన ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అధికారులను కోరారు. జాతీయ రహదారిపై ప్రతిరోజూ గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుండటంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, అత్యవసర పనులపై వెళ్లే ప్రజలు సైతం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు.

ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సీఐ రమేష్, ఆర్ అండ్ బి అధికారులతో కలిసి కళ్లెం నవజీవన్ రెడ్డి హయత్ నగర్ జాతీయ రహదారిపై క్షేత్రస్థాయిలో పర్యటించి, ట్రాఫిక్ సమస్య తీవ్రతను పరిశీలించారు. ట్రాఫిక్ రద్దీకి ప్రధాన కారణాలను అధికారులతో చర్చించి, సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరారు. తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా, భవిష్యత్తులోనూ ట్రాఫిక్ సమస్య పునరావృతం కాకుండా శాశ్వత ప్రణాళిక రూపొందించాలని సూచించారు. హయత్ నగర్ ప్రజలు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలకు ముగింపు పలకడమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల ప్రయాణం సులభతరం అయ్యే వరకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం కృషి చేస్తామని కళ్లెం నవజీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యతగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, హయత్ నగర్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మాల్ సర్పంచ్, ఉపసర్పంచ్

కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

అభివృద్ధికి ఆకర్షితులై భారీగా చేరికలు



యాచారం, నవంబర్ 05(జనం సాక్షి) : మండలం మాల్ గ్రామ సర్పంచ్ బెల్లి అశోక్, ఉపసర్పంచ్ కొండాపురం మల్లమ్మతో పాటు వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం సాయంత్రం ఇబ్రహీంపట్నం శాసనసభ్యు లు మల్‌రెడ్డి రంగారెడ్డి గారి సమక్షంలో వారు హస్తం గూటికి చేరగా, ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గారి నాయకత్వంలో నియోజకవర్గంలో వేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు, నిరుపేదలకు అందుతున్న సంక్షేమ ఫలాలు తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. మాల్ గ్రామాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యేకు మద్దతుగా నిలవాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... మాల్ గ్రామాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. పార్టీలో అంకితభావంతో, కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ ఛైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ యాచారం మండల అధ్యక్షుడు శ్రీశైలం, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ మహిపాల్, నాయకులు పొలమోని రామకృష్ణ, పాశం జయప్రకాశ్, లిక్కి రాజారెడ్డి, మాజీ సర్పంచ్ పద్మా జహంగీర్, మురళి, గిరి, గాలయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాడిపశువులను ఆరోగ్యంగా కాపాడుకోవాలి

మండల పశువైద్య అధికారి చంద్రశేఖర్ రెడ్డి

మొయినాబాద్, జనంసాక్షి: గ్రామాలలో రైతులు పశువులను ఆరోగ్యంగా కాపాడుకోవాలని మండల పశువైద్య అధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా పశువులకు రోగ నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి, మేడిపల్లి, అప్పారెడ్డిగూడ గ్రామాల్లో వైద్య సిబ్బంది పశువులకు రోగనివారణ మందులను వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాలలో పాడి రైతులు తమకు ఉన్న పశువులను రోగ నిరోధక మందులు తప్పనిసరిగా వాడాలని తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఈ మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని సూచించారు. పశువైద్య ఆసుపత్రి ద్వారా గ్రామాలలో ఈ కార్యక్రమం రెండు రోజులు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పారెడ్డిగూడ సర్పంచ్ పద్మఅశోక్ గౌడ్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాల ఉపాధ్యాయ వృత్తికి విరమణ : మల్లేశ్వర్‌కు ఘన సన్మానం



దోమ, నవంబర్ 05 జనం సాక్షి : విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ, తనదైన బోధనా శైలితో ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చిన ఉపాధ్యాయుడు, మోత్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్. మల్లేశ్వర్ పదవీ విరమణ సందర్భంగా గురువారం ఘనంగా సన్మాన సభ నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా బాధ్యతగా భావిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో మల్లేశ్వర్ తనదైన ముద్ర వేసుకున్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నైతిక విలువలు పెంపొందిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలిచారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి నిరంతరం కృషి చేస్తూ తోటి ఉపాధ్యాయులు, గ్రామ ప్రజల మన్ననలు పొందారు. ఆయన పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొని మల్లేశ్వర్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయ వృత్తిలో అందించిన సేవలను కొనియాడారు. విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఉపాధ్యాయుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి గ్యామ, మండల విద్యాధికారి వెంకట్, వికారాబాద్ జిల్లా బిసి ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ ధనేశ్వర్,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. పాండు,మోత్కూర్ గ్రామ సర్పంచ్ ఆనంద్,మాజీ ఉప సర్పంచ్ శ్రీకాంత్ రావు,ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి రవీందర్ రెడ్డి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వర్తించినా.. విద్యార్థుల హృదయాల్లో మాత్రం ఎప్పటికీ గురువుగానే నిలిచిపోతారనే భావన ఈ సన్మాన సభలో ప్రతిధ్వనించింది..

రైతులు భూపరీక్షలు తప్పనిసరి నిర్వహించుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి
- వెంకటాపూర్లో ఖేత్ బచావో అభియాన్ అవగాహన



మొయినాబాద్,నవంబర్05, జనంసాక్షి: రైతులకు నేల ఆరోగ్యం ప్రాముఖ్యత భూసార పరీక్షల ఆధారంగా సమతూల్య ఎరువుల వినియోగంతో అభివృద్ధి చెందుతారని మండల వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో ఖేత్ బచావో అభియాన్పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధారెడ్డి మాట్లాడుతూ నేలసారాన్ని కాపాడే పద్ధతులు, వంటల మార్పిడి, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చునని పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకోని నీటి వనరులను పొదుపుగా వాడుకోవాలని తక్కువ నీటితో వంట సాగు చేయగల వంటలను ఎంచుకోవాలని సూచించారు. స్వల్ప కాలిక వంటలు వసువు ధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రసాయన ఎరువులు, పురుగుల మందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని తెలిపారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా రైతులకు సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విస్తీర్ణ అధికారి శ్రీనివాస్, సర్పంచ్ అర్జునఅజయ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు విజయ్ రెడ్డి, ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.



విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకోవాలి

- అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల కోఆప్షన్ మెంబర్ నర్సింహ్మాచారి
- జిల్లా పరిషత్ పాఠశాలలో పేరెంట్స్, విద్యార్థుల సమావేశం

మొయినాబాద్,అక్టోబర్05,జనంసాక్షి: విద్యార్థులు క్రమ శిక్షణతో నాణ్యమైన విద్యను అభ్యసించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల కోఆప్షన్ మెంబర్ నర్సింహ్మాచారి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బి. అశ్విని, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుకఅరుణ్ గౌడ్లు అన్నారు. గురువారం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ను ప్రధానోపాధ్యాయురాలు రేణుక నిర్వహించారు. ఈ సందర్భంగా గడిచిన విద్యా సంవత్సరం పరీక్షల ఫలితాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్య పట్ల, విజ్ఞానం పట్ల తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే పాఠశాలల్లో నాణ్యమైన విద్య అభ్యసించేందుకు ముందుంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తుందని గడిచిన విద్యా సంవత్సరం ఫలితాలు ఆదర్శంగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులు మండల, జిల్లాస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక, కోఆప్షన్ సభ్యులు నర్సింహ్మాచారి, పాఠశాల చైర్మన్ అశ్వినిభరత్ కుమార్, ఉపసర్పంచ్ జితేందర్రెడ్డి, ఉపాధ్యాయులు రమేష్, అంకూర్నాయక్, అలివేలు మంగ, మహేశ్వరి, శోభారాణి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఘనంగా చందానగర్ లైట్‌హౌస్ నాలుగో వార్షికోత్సవ వేడుకలు

శేరిలింగంపల్లి, నవంబర్ 05 (జనంసాక్షి) : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) సహకారంతో చందానగర్ లైట్‌హౌస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నాలుగో వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, లైట్‌హౌస్ జాతీయ విస్తరణ విభాగం అధిపతి అతుల్, తెలంగాణ విస్తరణ విభాగం అధిపతి ఆకుల శ్రీనివాస్, చందానగర్ లైట్‌హౌస్ బృంద సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ లైట్‌హౌస్ అందిస్తున్న నైపుణ్య శిక్షణా కోర్సులు యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. శిక్షణతోపాటు ఉద్యోగ అనుసంధానం ద్వారా ఇప్పటివరకు 1,500 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాలుగా యువత సాధికారతకోసం నిరంతరం కృషి చేస్తున్న లైట్‌హౌస్ బృందాన్ని ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి



దోమ, నవంబర్ 5 (జనంసాక్షి): గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయొద్దని, ఏడాదికి 200 రోజుల పని కల్పించి రోజుకు రూ.800 కూలీ చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటయ్య డిమాండ్ చేశారు. నవంబర్ 6న హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో ఉపాధి హామీ కూలీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ మేరకు బుధవారం దోమ మండల కేంద్రంలో చలో హైదరాబాద్ కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. గ్రామాలను మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం చేయడంతో ఆయా ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు నిలిచిపోయి వేలాది మంది కూలీలు ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, వైద్య సదుపాయాలు, వేసవి అలవెన్సులు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విలీన గ్రామాల్లోనూ ఉపాధి పనులు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హెచ్. సత్యయ్య, మండల అధ్యక్షుడు రఘురామ్, నాయకులు మహిపాల్ రెడ్డి, శీను, మొగులయ్య, మోహన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం.. చెత్త ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మహేశ్వరం మెడికల్ కాలేజీ విద్యార్థుల ఆందోళనకు హరీశ్‌రావు మద్దతు

- ప్రొఫెసర్లు, ల్యాబ్‌లు, లైబ్రరీ, హాస్టల్ సౌకర్యాలు కరువు
- విద్యార్థుల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతాం
- సీఎం తనకు తానే గొప్పవాడినని సర్టిఫికెట్ ఇచ్చుకుంటున్నారు

హైదరాబాద్, నవంబర్ 6 (జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నప్పటికీ విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. మహేశ్వరం మెడికల్ కాలేజీ విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు ఆయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని ముఖ్యమంత్రులందరిలో తానే గొప్పవాడినని రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి పనితీరుకు ప్రజలు, విద్యార్థులు సర్టిఫికెట్ ఇవ్వాలని, తనకు తానే గొప్పవాడినని ప్రకటించుకోవడం సరికాదని అన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్సార్, కేసీఆర్ కంటే తానే ఉత్తమ ముఖ్యమంత్రినని చెప్పుకోవడం ఆత్మస్తుతి, దబ్బా కొట్టుకోవడమేనని ఎద్దేవా చేశారు.



మహేశ్వరం మెడికల్ కాలేజీలో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. కళాశాలలో సరిపడా ప్రొఫెసర్లు లేరని, ల్యాబ్‌లు, లైబ్రరీ, వాష్‌రూమ్‌లు, బస్సు, రవాణా, హాస్టల్ సౌకర్యాలు అందుబాటులో లేవని తెలిపారు. అద్దెలు, విద్యుత్ బిల్లులు కూడా చెల్లించని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులు ప్రజా సమస్యలపై బయటకు వస్తే ముందస్తుగా హౌస్ అరెస్టులు చేస్తున్న పోలీసులు, విద్యార్థుల ఇబ్బందులను మాత్రం ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థ, జిల్లా కలెక్టర్, వైద్య విద్యాశాఖ ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు.

గత తొమ్మిదేళ్లలో తెలంగాణలో వైద్య విద్యను ఎంతో అభివృద్ధి చేసి దేశంలోనే అత్యధిక సంఖ్యలో వైద్యులను తయారు చేసే స్థాయికి తీసుకెళ్లామని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల విద్యార్థులు సైతం తెలంగాణకు వచ్చి వైద్య విద్యను అభ్యసించే పరిస్థితి గతంలో ఉండేదన్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, వారి ఇబ్బందులను అసెంబ్లీలో కూడా ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.